క్లుప్తంగా

రేపు బోనాలు

బాలానగర్: మండల కేంద్రంతోపాటు మోతీ ఘణాపూర్, గంగారిపల్లిలో బుధవారం కట్ట మైసమ్మ, పోచమ్మ, యావాలమ్మ, లక్ష్మమ్మ బోనాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్‌లు విజయలక్ష్మి, మాలతి తదితరులు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు.

జానంపేటలో సంత ప్రారంభం

అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేట గ్రామంలో సోమవారం వారాంతపు కూరగాయల సంత కొత్తగా ప్రారంభమైంది. స్థానిక సర్పంచ్ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అనిల్ రెడ్డి, నాయకులు శివరాములు, మల్లయ్యలు సంతను ప్రారంభించారు. మూసాపేట మండల కేంద్రంలో మంగళవారం, వేములలో సోమవారం, చక్రాపూర్‌లో శుక్రవారం కూరగాయల సంతలు కొనసాగుతుండగా తాజాగా సోమవారం జానంపేటలో సంత మొదలైంది. వివిధ గ్రామాల నుంచి వారు కూరగాయలను విక్రయించారు.

కందూర్‌లో భక్తులకు అన్నదానం

అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన కారెడ్డి బొజ్జిరెడ్డి దంపతులు భక్తులకు సౌకర్యం కల్పించారు. శ్రావణమాసం కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. కల్పవృక్షాల కింద కూర్చుని భక్తులు భోజనాలు చేసినట్లు ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్ తెలిపారు. ఈఓ రాజేశ్వరశర్మ, ఆలయ కమిటీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది అనంతశర్మ, సాయిబాబా తదితరులు ఉన్నారు.

సముచిత స్థానం కల్పించాలి

నవాబుపేట: సీనియర్ సిటిజన్‌లకు సమాజంలో సముచిత స్థానం కల్పించాలని వారి సలహాలు సూచనలు పాటించాలని సీనియర్ సిటిజన్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రపంచ సీనియర్ సిటిజన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. నాయకులు వెంకటేశ్వరప్ప, చిన్నాస్వామి, విజయ్‌కుమార్, అనంతయ్య, వేణునాథం, పండారినాథ్, వెంకటయ్య, పెంటయ్య ఉన్నారు.

దేవరకద్ర కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రదీప్‌కుమార్‌గౌడ్ దరఖాస్తు

దేవరకద్ర: నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేయడానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆయన వెంట ఓబీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాధాకృష్ణరెడ్డి, జిల్లా ఓబీసీ అధ్యక్షులు బాల్‌చందర్‌గౌడ్, నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం

అడ్డాకుల: మూసాపేట తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బ్రహ్మంగౌడ్‌ను సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఆయన కార్యాలయంలో కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ జి.ఇంద్రయ్యసాగర్, కొండయ్య, లక్ష్మీనర్సింహ్మ, జమీర్, నర్సిములుగౌడ్ ఉన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

చిన్నచింతకుంట: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు అరికట్టాలని చిన్నచింతకుంట ఎంబీసీయోన్ చర్చ్ ఫీల్డ్ సెక్రెటరీ జీజీపాల్, పాస్టర్ రేవ గిద్దియోన్‌లు డిమాండ్ చేశారు. సోమవారం చర్చి కమిటీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలి నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సి. కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ చైర్మన్ రేవా, మోష, యోన, ఆనంద్, సుదర్శన్, ఎస్‌శేఖర్, ప్రతాప్, యాకోబ్, ప్రవీణ్ , అఖిల్ పాల్గొన్నారు.

'కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి'

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించిన భూమిని కబ్జా చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఆర్‌ఓ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపినట్లు వివరించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కానుగడ్డ యాదయ్య, నాయకులు రాములు, మల్లెల రాజశేఖర్, చెన్నయ్య, శ్యాసుందర్ పాల్గొన్నారు.

'భగీరథ' పైపులైన్ లీకేజీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 28వ వార్డు పరిధిలోని కురిహినిశెట్టి కాలనీలో కోట మైసమ్మ ఆలయం వద్ద సుమారు ఆరు నెలలుగా మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. తాగునీరు వదిలినప్పుడు రోడ్డంతా వృథాగా పారుతోందన్నారు. నడవడానికి, వాహనదారులకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ విషయమై ఏఈ వైష్ణవిని వివరణ కోరేందుకు యత్నించగా స్పందించలేదు.


జడ్చర్ల బంగారుమైసమ్మ దేవాలయం భక్తుల సందడి


నవాబుపేటలో..

ఘనంగా నాగుల పంచమి


జిల్లాకేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


అడ్డాకులలో..

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణంలో నాగపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కాటన్‌మిల్లు వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోనూ భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా వీరన్నపేట రామలింగేశ్వర స్వామి, టీచర్స్ కాలనీ రామాలయంలోని నాగుల సన్నిధి, శ్రీనివాస కాలనీ పంచముఖ ఆంజనేయ స్వామి, స్టేషన్ గుట్ట మీదున్న వీరాంజనేయ స్వామి, షాసాబ్ గుట్ట వీరాంజనేయ స్వామి, శేషాద్రి నగర్‌లోని శివాంజనేయ స్వామి, నాగేంద్ర నగర్, బాలాజీనగర్‌ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జడ్చర్ల టౌన్: నాగుల పంచమి వేడుకలను సోమవారం జడ్చర్లలో ఘనంగా నిర్వహించారు. బాగ్యేశ్వరాలయంలోని నాగులు, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహానికి పాలు పోసేందుకు మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. పాతబజార్ బంగారు మైసమ్మ దేవాలయంలోనూ భక్తుల సందడి నెలకొంది. పుట్ట, నాగుల విగ్రహాలకు పాలు పోసేందుకు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. జడ్చర్లలో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలోనూ వేడుకలు నిర్వహించారు.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామాల్లో సోమవారం నాగపంచమి నిర్వహించారు. శివాలయాల వద్ద ఉన్న నాగుల విగ్రహాలకు మహిళలు అభిషేకాలు చేసి కొబ్బరి కాయలు సమర్పించారు. అనంతరం పాలు పోసి పూజలు చేశారు. అడ్డాకులలో పండితుడు రాజేష్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

నవాబుపేట: మండల పరిధిలోని పలు ఆలయాల్లో సోమవారం నాగుల పంచమి ఘనంగా నిర్వహించారు. మహిళలు నాగ దేవతకు, పుట్టలకు పూజలు చేశారు.


జిల్లాకేంద్రంలోని కాటన్‌మిల్ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో..

ఇల్లులేని పేదలందరికీ 'గృహలక్ష్మి'


నాన్‌చెరువుతండాలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రాజాపూర్: తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదవాడికి ఇల్లు నిర్మాణమే లక్ష్యంగా గృహలక్ష్మి పథకాన్ని తీసుకువచ్చిందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాన్‌చెరువుతండాలో గృహలక్ష్మి లబ్ధిదారుల దరఖాస్తులను ఆయన క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఇల్లులేని పేదలందరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తామన్నారు. పథకం ఎంతో ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందజేస్తారని ఆయన పేర్కొన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య జెడ్పీటీసీ మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలో గృహలక్ష్మి పథకానికి 4,453 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం కోడూర్‌లో ఎంపీఓ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించారు. 26 గ్రామాలలో సర్వే పూర్తి చేసిన అనంతరం తుది జాబితాను సిద్ధం చేస్తామని ఎంపీఓ పేర్కొన్నారు. సర్పంచ్ శ్రీకాంత్‌గౌడ్, కార్యదర్శి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: మండలపరిధిలో గృహలక్ష్మి పథకం దరఖాస్తుల సర్వే, వివరాల సేకరణ సాగుతోంది. సోమవారంతో 25 గ్రామాల్లో వివరాల సేకరణ పూర్తయినట్లు ఎంపీడీఓ కృష్ణారావు తెలిపారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లోకి..


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల వారు బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం అన్నాసాగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో పోతులమడుగుకి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా మాట్లాడారు. మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ రమేష్ చందర్ తదితరులు ఉన్నారు.

చిన్నచింతకుంట: సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమయిందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో పంచాయతీ భవనానికి, ముస్లింల శ్మశాన వాటిక ప్రహరీకి భూమిపూజ చేశారు. మూడోసారి పోటీచేసేందుకు అవకాశం ఇవ్వడంతో కేసీఆర్‌కు పాదాభివందనాలు తెలిపారు. ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



జడ్చర్ల టౌన్: విశ్వశాంతి యాగ మహోత్సవ ప్రాంగణంలో సోమవారం రాత్రి శివనామస్మరణతో మారుమోగింది. యాగ మహోత్సవంలో భాగంగా రాత్రి 10వేల శివలింగాలకు అభిషేకం నిర్వహించారు. ఉదయం అమృత, పాశుపతాస్త్ర మృత్యుంజయ రుద్ర, విజయలక్ష్మి హోమాలు చేపట్టారు. లింగాలకు అభిషేకాలు, రుద్రక్రమార్చన, లక్ష బిల్వార్చన, సహస్ర జ్యోతిలింగార్చనలు చేశారు.

బోనాలతో రెండో ఏఎన్‌ఎంల నిరసన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రెండో ఏఎన్‌ఎంల సేవలను గుర్తించి, వారి డిమాండ్లను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామ్మోహన్ కోరారు. రెండో ఏఎన్‌ఎంలు చేస్తున్న సమ్మె సోమవారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు బోనం ఎత్తుకుని నిరసన వ్యక్తం చేశారు. రెండో ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, ప్రధాన కార్యదర్శి మంజుల, కోశాధికారి భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు గిరిజ, పద్మజ, రాణి, సహాయ కార్యదర్శులు ఎల్లమ్మ, జ్యోతి, రేణుక, అనురాధ, అంజమ్మ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి


మహిమూద్ (ఫైల్)

అడ్డాకుల: అనారోగ్యానికి గురైన సొంత బావను ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బావమరిది చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. అడ్డాకుల ఎస్‌ఐ మాధవరెడ్డి వివరాల ప్రకారం.. కొల్లాపూర్ మండలం ఎల్లూర్ గ్రామానికి చెందిన మహిమూద్ అలియాస్ సులెమాన్(40), మైనోద్దిన్ సోదరులు. జటప్రోల్‌కు చెందిన వారి అక్క భర్త మజహార్ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందాడు. కాగా ఈనెల 16న డిశ్చార్జ్‌కాగా మధ్యరాత్రి ఆయనను ఇద్దరు బావమరుదులు, భార్య ఇంటికి తీసుకెళ్లేందుకు కారులో బయలు దేరారు. ఈ క్రమంలో తెల్లవారుజామున శాఖాపూర్ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీ వెనుక కారుతో ఢీకొట్టారు. ఘటనలో మహిమూద్ తీవ్రంగా గాయపడగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి.. అక్కడి నుంచి యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి మరింత క్షీణించడంతో ఆదివారం నిమ్స్‌లో చేర్చగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మహిముద్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ప్లీనరీకి తరలి రావాలి

భూత్పూర్: ముదిరాజ్‌లు ఈ నెల 25న హైదరాబాద్‌లో జరిగే ప్లీనరీకి అధిక సంఖ్యలో తరలిరావాలని మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని మునిరంగస్వామి ఆలయ ప్రాంగణంలో ప్లీనరీ వాల్‌పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్ర బాలప్ప, ముడా డైరక్టర్ సాయిలు, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రవీందర్, ఫిషరీస్ అధ్యక్షుడు బోల వెంకట్రాములు, గొడుగు వెంకట్ రాజు, పట్నం శ్రీశైలం , మల్లేష్, ఆశోక్, జైదు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళ, ఇద్దరు చిన్నారుల అదృశ్యం

భూత్పూర్: ఎల్కిచర్లలో మహిళ, ఇద్దరు చిన్నారులు అదృశ్యమైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు గ్రామానికి చెందిన మొగిలమ్మ, ఆంజనేయులుల కుమార్తె శిరీషకు ఆమె భర్త మధుకి మధ్య ఇటీవల గొడవలు జరిగాయి. ఈ క్రమంలో 10 రోజుల క్రితం భర్త మధు, మామ ఇద్దరు కలిసి శిరీషతో పాటు ఇద్దరు కుమార్తెలను మొగిలమ్మ ఇంట్లో వదిలేసి వెళ్లారు. ఆదివారం మొగిలమ్మ దంపతులు కూలీపని నిమిత్తం వెళ్లి సాయంత్రం ఇంటికి రాగా శిరీషతో పాటు మనవరాళ్లు కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ఆరాతీశారు. ఇంటి పక్కనే ఉన్న శివ తన బైక్‌పై వారిని ఎక్కించుకొని పోయినట్లు తెలియడంతో వెళ్లి అడిగారు. కాగా అతడు వారిని మద్దిగట్ల స్టేజి వద్ద వదిలి పెట్టినట్లు వివరించాడు. ఘటనపై మొగిలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ. శ్రీనివాసులు తెలిపారు.

విద్యుత్ సిబ్బందిపై దాడికి యత్నం

- మహిళపై కేసునమోదు

మహమ్మదాబాద్: విద్యుత్ బిల్లులను వసూలు చేయడానికి వచ్చిన సిబ్బందిపై ఓ మహిళ దాడికి యత్నించిన నేపథ్యంలో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. . లైన్‌మన్ గాజుల కేశవులు, అసిస్టెంట్ ఏదుల రవితో కలిసి ఈనెల 20న పంచలింగాల్ తండాలో బిల్లులు వసూలు చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో సుశీలాబాయి ఇంటికి వెళ్లి బిల్లు కట్టాలని కోరగా, తాను కట్టనని ఏం చేసుకుంటారో చేసుకోండని ఆమె దబాయించింది. సుశీల అన్న పాండుకు ఫోన్ చేయగా కరెంటు కట్‌చేసుకోండని చెప్పడంతో సిబ్బంది విద్యుత్ వైర్లు కట్ చేయబోయారు. దీంతో ఆమె సిబ్బంది చొక్కా కాలర్ పట్టుకుని దుర్భాషలాడింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో నాగుపాము కలకలం



రాజాపూర్: నాగులపంచమి రోజు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఓ నాగుపాము కలకలం సృష్టించింది. ఎస్‌ఐ రూంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడే ఉన్న సిబ్బంది గమనించి వెంటనే సర్పరక్షకుడు రాజాపూర్ రామకృష్ణకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన అక్కడికి చేరుకుని పామును పట్టుకుని వెళ్లి అడవిలో వదిలిపెట్టారు.

వ్యాయామ సామగ్రి ఏర్పాటు

బాలానగర్: మండలపరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె క్రీడాప్రాంగణాల్లో శాశ్వత వ్యాయామ సామగ్రి బిగింపు కార్యక్రమం కొనసాగుతోంది. వాయిల్‌కుంట తండాలో ఏర్పాటు కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీఓ కృష్ణారావు పరిశీలించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక ఎమ్మెల్యే దొడ్డన్న గౌడ

మహబూబ్‌నగర్ రూరల్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేద్దామని ఎమ్మెల్యే దొడ్డన్న గౌడ పాటిల్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక సంస్థల్లో పోటీ చేసి గెలిచిన, ఓడిన అభ్యర్థులతో ఇష్టగోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.పద్మజారెడ్డి, ఎన్‌పీ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కోశాధికారి పాండురంగారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, మండల అధ్యక్షుడు రాజుగౌడ్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మరణం తీరనిలోటు


బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

జడ్చర్ల టౌన్: కలం, గళం ప్రజాపోరుకి అంకితం చేసిన గద్దర్ మరణం తీరని శోకాన్ని మిగిల్చిందని డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా. శ్రీనివాసులు అన్నారు. సోమవారం తెలుగు, సామాజిక శాస్త్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన గద్దర్ సాహిత్యం.. తెలంగాణ ఉద్యమంపై ప్రభావం సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఆడపిల్లలను చిన్నచూపు చూసే సామాజిక రుగ్మతపై గద్దర్ పాటపోరును తెలిపేనిండు అమాసనాడు ఓ లచ్చ గుమ్మాడి పాటను హృద్యంగా ఆలపించారన్నారు. సూర్యరశ్మికన్నా సూటైన కవిత్వాన్ని గద్దర్ వెలువరించారన్నారు. వేమన తరువాత గద్దర్ గొప్ప ప్రజాకవిగా అభిప్రాయపడ్డారు. సదస్సులో అధ్యాపకులు భీరయ్య, డా.కల్యాణి నరసింహారావు, సుభాషిణి, రమాదేవి, నందకిశోర్, కవిత, నాగరాజు, ఎన్‌సీసీ ఆఫీసర్ యాదయ్య మాట్లాడుతూ ధూంధాం లేకుండా తెలంగాణ రాష్ట్రం ఎక్కడిదని అన్నారు. గద్దర్ గళ ప్రళయం అన్నారు. గద్దర్ పాటలు పాడిన విద్యార్థులు మానస, శ్రీలక్ష్మి, రవి, సింధులకు బహుమతులు అందజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని నిరసన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పలు గురుకులాలు, కేజీబీవీలు, పాఠశాలలను సందర్శించామని పుస్తకాలు, వసతులు, బోధన సిబ్బంది కొరత, తాగునీరు, మరుగుదొడ్లు వంటి అనేక సమస్యలు ఉన్నాయన్నారు. వెంటనే వసతులు కల్పించాలని అన్నారు. ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అధ్యక్షుడు భరత్, నందు, శ్రీనాథ్, సాయి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత ఖర్చుతో పొలాలకు రోడ్డు

నవాబుపేట: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సొంత ఖర్చులతో రైతుల పొలాల్లో రోడ్లు వేస్తున్నట్లు జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేస్తున్న రోడ్డు పనులను ప్రారంభించారు. దాదాపు రూ.10 లక్షలతో ఏర్పాటు చేయనున్న రోడ్డుతో రోడ్డుతో నవాబుపేట, రుక్కంపల్లి గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. నవాబుపేట సర్పంచ్ గోపాల్‌గౌడ్, ముడా డైరెక్టర్ చెన్నయ్య, కోఆప్షన్ తాహేర్, రాం మనోహర్‌రాజు, చంద్రశేఖర్, శ్రీనివాస్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పీయూలో నియామకాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఐక్యూఏసీ డైరెక్టర్‌గా కిషోర్‌ను నియమించారు. గతంలో పనిచేసిన మధుసూదన్‌రెడ్డి స్థానంలో ఆయన నియమితులయ్యారు. కాగా మధుసూదన్‌రెడ్డిని యూజీ, పీజీ ఆడిట్‌సెల్ డైరెక్టర్‌గా నియమించారు. గతంలో బాధ్యతలు నిర్వహించిన చంద్రకిరణ్‌ను పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ మేరకు వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ ఆర్డర్‌లు అందజేశారు.

నిధుల మంజూరుపై హర్షం

అడ్డాకుల: మూసాపేట మండలంలోని అచ్చాయపల్లిలో గ్రామ పంచాయతీ కోసం నూతన భవనం నిర్మించడానికి నిధులు మంజూరు కావడంతో బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జెడ్పీటీసీ జి.ఇంద్రయ్యసాగర్, స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు కొండయ్య, లక్ష్మీనర్సింహ్మ, శివరాములు, జమీర్, రాజు ఉన్నారు.

చైతన్య పరిచేందుకే 'వాయిస్ ఫర్ గర్ల్స్'


వాయిస్ ఫర్ గర్ల్స్ ప్రారంభ కార్యక్రమంలో ఉపాధ్యాయులు

మహమ్మదాబాద్: బాలికలను చైతన్య పరిచేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమమే వాయిస్ ఫర్ గర్ల్స్ అని నంచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్ వెంకటమ్మ తెలిపారు. సోమవారం గురుకులలో మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని 11 పాఠశాలల నుంచి 165 మంది 8వ తరగతి విద్యార్థినులతో కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబచ్చేందుకు విద్యార్థులను ప్రోత్సహించనున్నట్లు వివరించారు. ఈనెల 30 వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. వాయిస్‌ఫర్ గర్ల్స్ ఫీల్డ్ ఆఫీసర్ దిశ, టీం మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబురాలు


జిల్లాకేంద్రంలో నృత్యాలు చేస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అసెంబ్లీ టిక్కెట్‌ను మరోసారి శ్రీనివాస్‌గౌడ్‌కు కేటాయించడంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం సంబరాలు చేసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ నర్సిములును భుజాలపై ఎత్తుకుని నృత్యం చేశారు. మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రానుందని మున్సిపల్ చైర్మన్ అన్నారు. శ్రీకాంత్‌గౌడ్, రాజేశ్వర్, గణేష్, శ్రీనివాస్‌రెడ్డి, రాంలక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పరిగి నియోజక వర్గం నుంచి మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యేకే టికెట్ ఇవ్వనుండడంతో బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలు చేశారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు సలీం తదతరులు ఉన్నారు.

దేవరకద్ర: బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మూడో సారి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి అవకాశం రానుండడంతో సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో సంబురాలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆయనకు స్వాగతం పలికి పూలమాలలతో ముంచెత్తారు. ఎంపీపీలు రమాదేవి, హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీలు అన్నపూర్ణ, రాజేశ్వరి, వైస్ ఎంపీపీ సుజాత, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: ఆలను ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ప్రకటించడంతో అడ్డాకుల మండల కేంద్రంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు.

భూత్పూర్: మండలంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, సీనియర్ నాయకులు తదితరులు సంబరాల్లో పాల్గొన్నారు.

జడ్చర్ల: అసెంబ్లీ స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని ప్రకటించడం పట్ల స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సంబరాలు నిర్వహించారు. జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ అనంతయ్య, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీ, డీసీఎం ఢీ : డ్రైవర్లకు తీవ్ర గాయాలు



దేవరకద్ర రూరల్: లారీ, డీసీఎం ఢీకొన్న ఘటనలో డ్రైవర్లకు తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న డీసీఎంను హైద్రాబాద్ నుంచి రాయిచూర్ వైపు పశువుల దాణా లోడ్‌తో వెళ్తున్న లారీ మన్యంకొండ స్టేజీకి దగ్గరలోని కాకతీయ స్కూల్ సమీపంలో ఢీ కొట్టింది. ఘటనలో డీసీఎం డ్రైవర్ చాంద్‌పాషాకు తీవ్రంగా, లారీ డ్రైవర్ అంకన్నకు స్వల్పంగా గాయాలయ్యాయి. అంతరాష్ట్ర రహదారిపై ప్రమాదం జరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

మొబైల్ దుకాణంలో అగ్నిప్రమాదం

జడ్చర్ల: పట్టణంలోని శ్రీనివాస థియేటర్ వద్ద ఉన్న ఓ మొబైల్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఘటనలో ఫ్రిజ్ నుంచి మంటలు వచ్చి దుకాణం అంతా వ్యాపించాయి. దీంతో చేసేది లేక ప్రాణాలు దక్కించుకునేందుకు దుకాణ యజమాని షబ్బీర్ బయటకు పరుగులు తీశాడు. స్థానికుల సహకారంతో మంటలను ఆర్పారు. ఘటనలో రూ. లక్షల్లో నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నారు.